క్లుప్తంగా

18న అర్హత పరీక్ష

అమ్రాబాద్: ఈ నెల 18న మండలంలోని మన్ననూర్‌లో గల పీటీజీ బాలుర కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ కోసం అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 384 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 8:00 గంటల లోపు చేరుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, హాల్‌టికెట్‌లను ఇన్విజిలేటర్లకు చూపించాలని వివరించారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

కల్వకుర్తి టౌన్: గిరిజన గురుకులాలలోని ఇంటర్‌లో ప్రవేశం కొరకు నిర్వహించే సీఓఈ సెట్–2024 రాసే విద్యార్థులు హాల్‌టికెట్లును డౌన్‌లోడ్ చేసుకోవాలని కల్వకుర్తి ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

వైభవంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



వెల్దండ: మండలంలోని అంతిరెడ్డిపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠలో భాగంగా బుధవారం గ్రామ దేవతల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా ఈ నెల 15వ తేదీన ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, గ్రామ దేవతలైన పోచమ్మ, శీతలాంబదేవి బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నిర్వాహకులు, భక్తులు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ నిర్మాణాలకు భూమిపూజ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఆకుతోట ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర పలు దేవాలయాల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. శివాలయ, బ్రహ్మంగారి, సుబ్రమణ్యేశ్వర స్వామి, నవగ్రహాల ఏర్పాటుకు అర్చకులు శాస్త్రోక్తంగా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమంలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తి: పట్టణంలోని వడ్డెరబస్తీ కాలనీలో దివ్యాంగురాలు రసియాబేగంకు కుట్టుమిషన్ కొనుగోలు కోసం మిత్ర ఫౌండేషన్ సభ్యులు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. బుధవారం ఆమె ఇంటికి వెళ్లి నగదు ఇచ్చారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్ సెల్‌ఫోన్ చోరీకి గురైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పట్టణంలో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బాలయ్య అచ్చంపేటకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చాడు. బస్సు ఎక్కుతున్న క్రమంలో ఫోన్ చోరీకి గురైంది. బస్సులో కూర్చున్న తర్వాత ఫోన్ లేకపోవడంతో వెంటనే బస్సు దిగాడు. బస్టాండ్‌లో అనుమానస్పదంగా ఉన్న వ్యక్తిపై పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు బస్టాండ్‌కు చేరుకుని అనుమానితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

వంట మనిషిని నియమించాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని చుకాయిపల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో వంట మనిషి లేక విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడంలేదని జిల్లా తెలంగాణ దండోరా అధ్యక్షుడు దేవనికుమార్ అన్నారు. బుధవారం ఆయన పాఠశాలను సందర్శించి విద్యార్థులతో అక్కడ ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల నుంచి విద్యార్థులకు భోజనం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటెండర్ లేక పాఠశాల మొత్తం అపరిశుభ్రంగా మారిందన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లేని పక్షంలో దండోరా ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత దండు నియోజకవర్గ నాయకులు మల్లేల వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ధర తగ్గిన వేరుశనగ

కల్వకుర్తి: వేరుశనగ ధరల తగ్గుదలపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ప్రత్యక్ష దాడులు సైతం జరిగాయి. అయితే ధరల తగ్గుదల కొనసాగుతూనే ఉంది. బుధవారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో 184 మంది రైతులు 7,635 బస్తాల్లో 2,290 క్వింటాళ్ల వేరుశనగను అమ్మకానికి తీసుకొచ్చారు. అత్యధికంగా రూ.6,830, మధ్యస్థంగా రూ.6,012, తక్కువగా రూ.4,012 ధర లభించింది. ధర తగ్గిపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



కొల్లాపూర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



కల్వకుర్తి మండలం సరస్వతి శిశుమందిరంలో..

అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో బుధవారం పంచమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి విగ్రహానికి విద్యార్థులు పూజలు చేశారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు వాసవీక్లబ్ డైమండ్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు చేశారు.

కల్వకుర్తి: పట్టణంలోని పలు దేవాలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పట్టణంలోని వికాస్ టెక్నో స్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు వసంత పంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహించారు. బాసర నుంచి ప్రత్యేక కుంకుమను తీసుకొచ్చి, చిన్నారుల తల్లిదండ్రుల చేత పూజ చేయించారు. మురళీధర్ రెడ్డి, శంకర్, తిరుపతిరెడ్డి, నర్సిరెడ్డి, పాఠశాల ప్రధానాచార్యులు కృష్ణమోహన్, చిన్నారుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వసంత పంచమి విశిష్టతను చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వసుంధర, ఉపాధ్యాయులు వెంకటనర్సమ్మ, అరుణ, కావ్య, మాజీ అధ్యక్షుడు గుంత బాలయ్య పర్యవేక్షించారు.

తాడూరు: మండలంలోని గోవిందాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సరస్వతి అమ్మవారి చిత్రపటానికి హెచ్ఎం వెంకట్‌రెడ్డి పూలమాలలు ప్రత్యేక పూజలు చేశారు.



తాడూరులో



అచ్చంపేట మండలం నడింపల్లిలో



కల్వకుర్తిలో..

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరులో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 16 తేదీ నుంచి అలివేలుమంగ సమేత లక్ష్మీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తుల కోసం అన్ని వసతులు కల్పించామని ఎంపీటీసీ రంగారెడ్డి, నిర్వాహకులు పేర్కొన్నారు. మొదటిరోజు శుక్రవారం ఉదయం 5.30 గంటలకు ధ్వజారోహణం. 10 గంటలకు శేషవాహన సేవ, మధ్యాహ్నం 12.30 గంటలకు అశ్వవాహన సేవ, రాత్రి 8 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. రెండో రోజు శనివారం తెల్లవారుజామున 5 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు కుంకుమార్చన, రాత్రి 9.30 గంటలకు ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

స్కాలర్‌షిప్‌కు విద్యార్థులు ఎంపిక



కందనూలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు సోనీ, పూజిత, నాజ్ కతున్, హసిబా బేగంలు సంతూర్ ఉమెన్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ శర్మ తెలిపారు. బుధవారం శ్రీపురం రోడ్డులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపకుల సమక్షంలో ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు డిగ్రీ పూర్తయ్యే వరకు మూడు సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ.24 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సతీష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: కేసు నమోదు

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి అచ్చంపేటకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం కేజీబీవీ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండ ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంసానిపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కొట్టె గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అంజయ్య తెలిపారు.

మహిళా సంఘాలకు రుణాలు మంజూరు

తెలకపల్లి: మహిళా సంఘాలకు రూ.60 లక్షలు రుణాలు మంజూరు అయినట్లు ఐకేపీ ఏపీఎం నిరంజన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా లింకేజీ ద్వారా ఆరు స్వయం సహాయక సంఘాలకు రూ.60 లక్షల రుణాలు ఇచ్చేందుకు డాక్యుమెంటేషన్ చేశామన్నారు. రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికం ఎదగాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రాజ, సీసీ సుకునయ్య, వీఓఏ మల్లేష్, క్రాంతి మహిళా సంఘం అధ్యక్షురాలు అలివేల పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

వెల్దండ: మండలంలోని చెర్కూర్ గేట్ ఎదుట బుధవారం రాత్రి హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం భర్కత్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భీరయ్య బైక్‌పై వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న కారును బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న భీరయ్యకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ పునఃనిర్మాణం



అచ్చంపేట రూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామమైన అక్కారంలో బుధవారం ఆంజనేయస్వామి దేవాలయ పునఃనిర్మాణ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, గోపూజ, పబ్బుతి ఆంజనేయ స్వామి ఉద్వాసన వంటి పూజలు చేశారు. సాయంత్రం యాగశాల, నవగ్రహ మండపాన్ని నిర్వాహకులు ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు



అచ్చంపేట రూరల్: వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్లు గౌరీశంకర్, రమేష్‌రావు, మనోహర్‌ప్రసాద్, అంతటి శివ, శ్రీనివాసులు, టీపీఓ మనోజ, గౌస్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తా

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీచేస్తానని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ మల్లేపల్లి జగన్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ సభ్యులను ఆయన కలిశారు. ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. న్యాయవాద వృత్తిలో పేదలకు సేవలు అందించానని వివరించారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకే అధిష్ఠానం కేటాయిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతరెడ్డి, న్యాయవాదులు ఉపేందర్, భూజల భాస్కర్‌రెడ్డి, నజీరోద్దీన్, మోహన్‌లాల్, నిరంజన్, నాగరాజు తదితరులున్నారు.

కెనరా బ్యాంకు ప్రారంభం



కల్వకుర్తిరూరల్: కెనరా బ్యాంకు సేవలను మరింత విస్తృతం చేస్తామని జనరల్ మేనేజర్ సునీల్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో నూతన కెనరా బ్యాంకు శాఖను మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో వ్యవసాయ, గృహ, బంగారు, వాహనాలు రుణాలు ఇస్తున్నామన్నారు. 24 గంటల పాటు పనిచేసే ఏటీఎం సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ శ్రీకాంత్, బ్యాంకు మేనేజర్ రాఘవేందర్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పారిశ్రామికవేత్తలు రమేష్ బాబు, మనోహర్‌తో పాటు దాచేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

వెల్దండ: రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని బుధవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన యుజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శేఖర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలలో నెలకొన్న సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందజేశారు. మంత్రి సానుకులంగా స్పందించినట్లు శేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శేఖర్, గణేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వినియోగదారులు వివరాలు నమోదు చేసుకోవాలి



చారకొండ: గృహజ్యోతి పథకం ద్వారా ప్రభుత్వం అందించనున్న ఉచిత విద్యుత్ కోసం వినియోగదారులు వివరాలు నమోదు చేసుకోవాలని ప్రత్యేక అధికారి రాఘవేందర్ గౌడ్ కోరారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ అధికారులు జూపల్లి, చారకొండ, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటికి తిరిగి విద్యుత్ వినియోగదారుల నుంచి వివరాల నమోదు చేశారు. జూపల్లిలో లైన్‌మెన్, సంబంధిత అధికారులు వివరాలు సేకరించారు. గడువు ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. లైన్‌మెన్లు అయూబ్ ఖాన్, బాలు, ఆపరేటర్లు దయాకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కళాశాల గుర్తింపు రద్దు చేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల యజమానులు వార్షిక పరీక్షల పేరుతో విద్యార్థుల నుంచి అదనంగా రూ.1000లు, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల నుంచి రూ.1200లు అక్రమంగా ఫీజులు వసూలు చేశారని బీఎస్పీ విద్యార్థి సంఘం నాయకులు రామకృష్ణ ఆరోపించారు. ఆ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధుగౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



చెక్కును అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ భూపాల్‌రావు

ఉప్పునుంతల: ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘ (పీఏసీఎస్) సేవలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు సూచించారు. బుధవారం స్థానిక పీఏసీఎస్‌లో జిల్లా నాబార్డు వారి సూచనమేరకు డీసీసీబీ అచ్చంపేట బ్రాంచి వారు సంఘ సభ్యులుగా ఉన్న రైతులకు పీఏసీఎస్‌లో బ్యాంకు ఖాతాలు, రైతులకు అందిస్తున్న రుణాలు, ఇతర సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంట రుణాలను సకాలంలో చెల్లించి రెన్యూవల్ చేసుకున్న 3852 మంది రైతులకు ప్రమాద బీమా కల్పించామన్నారు. విగ్నేష్‌పూర్ గ్రామానికి చెందిన రైతు బొజ్జమ్మ గతేడాది ఏప్రిల్ నెలలో పిడుగుపాటుకు గురై చనిపోవడంతో ఆమె కుటుంబానికి రూ. 2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. డీసీసీబీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అభయ్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్లు నారాయణ్‌రెడ్డి, శ్రీను, సీఈఓ రవీందర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు

వెల్దండ: మండల కేంద్రంలో సయ్యద్ ఖాజాజిందా వలి ఉర్సును బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, జంగయ్యయాదవ్, వరప్రసాద్‌రెడ్డి, ఎర్రశ్రీనుముదిరాజ్, కృష్ణముదిరాజ్, మహ్మద్ షమ్‌షద్దీన్, ఇలియాస్, ఫరీద్, సాధిక్, రషీద్, తదితరులు ఉన్నారు.

వీర జవాన్లకు ఘన నివాళి



అచ్చంపేటలో మౌనం పాటిస్తున్న విద్యార్థులు



లింగాల ఉన్నత పాఠశాలలో

అచ్చంపేట రూరల్: పుల్వామా దాడిలో మరణించిన వీర జవాన్లకు బుధవారం వివిధ విద్యార్థి, పలు సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘన నివాళి అర్పించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వీర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి, మౌనం పాటించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. అలాగే దేశ సంస్కృతిని నాశనం చేస్తున్నటువంటి పాశ్చాత్య సంస్కృతిలో భాగమైన ప్రేమికుల రోజు వ్యతిరేకిస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ప్రదీప్ రెడ్డి, రాకేష్, శాంతన్, విజయ్ పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పుల్వామా దాడిలో మరణించిన వీర జవాన్లకు ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధి ఆంగోతు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. వీర జవాన్లు త్యాగాలు మరువలేవమన్నారు. విద్యార్థులకు 'మీలో ఎవరు విజేత' అనే ప్రోగ్రాంను నిర్వహించి విజేతలకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధే లక్ష్యం



పోస్టర్లను విడుదల చేస్తున్న సొసైటీ సభ్యులు

లింగాల: ప్రజల ఆర్థిక అభివృద్ధే లక్ష్యమని లీడ్ జిల్లా మేనేజర్ కౌశల్ కిషోర్ అన్నారు. మండల కేంద్రంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలన్నారు. రిజర్వ్ బ్యాంక్ గుర్తించిన ఆర్థిక సంస్థల ద్వారా ఆర్థిక వ్యవహారాలను కొనసాగించాలని ఆయన కోరారు. సంస్థలలో ఆర్థిక మోసాలు జరిగితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ బ్యాంకింగ్ అంబుడ్స్ మన్ ద్వారా పరిష్కారం పొందవచ్చన్నారు. బ్యాంక్‌లో అందించే సేవింగ్స్, రుణ సదుపాయాలను, బీమా పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని సూచించారు. బ్యాంకింగ్ వ్యవస్థ గురించి ప్రజలలో అవగాహన కల్పించుటకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలను చేపడతామన్నారు. బ్యాంక్ కార్యకలాపాలకు సంబంధించిన పోస్టర్లను సొసైటీ సభ్యులు విడుదల చేశారు. కార్యక్రమంలో సొసైటీ స్టేట్ కోఆర్డినేటర్ కె. అశోక్, జిల్లా సీఎఫ్ఎల్ జ్యోతి, శశిపాల్, అచ్చంపేట డివిజన్ సీఎఫ్ఎల్ పాండుకుమార్, మండల సీఎఫ్ఎల్ మన్సూర్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐదో వార్షికోత్సవాలు

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలోని సూర్యనారాయణ దేవాలయ ఆవరణలో స్వామివారి పంచమ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమవుతాయని సర్పంచ్ అశోక్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 15న ఉదయం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు దేవాలయానికి చేర్చుట, స్వామివారి అభిషేకం, ఆదిత్య పారాయణం, మద్భగవద్గీత షట్కము, పారాయణము, యజ్ఞం, పూర్ణాహుతి, సూర్యాష్టోత్తర శతనామావళి నిర్వహిస్తునట్లు తెలిపారు. 16న సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం, హారతి, 17న స్వామివారికి అభిషేకం, హారతి, తీర్థప్రసాదాలు ఉంటాయని వివరించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

బోరు డ్రిల్లింగ్



అమ్రాబాద్: మండలంలోని ఒటువర్లపల్లిలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతుండటంతో గ్రామస్తులు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందించి బుధవారం గ్రామంలో బోరు డ్రిల్లింగ్ చేయించడంతో పుష్కలంగా నీరు వచ్చింది. విద్యుత్ మోటర్ కూడా బిగించారు. మాజీ సర్పంచ్ చత్రునాయక్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ తాగునీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

యువతి పెళ్లికి అండగా నిలిచిన యువత



అచ్చంపేట రూరల్: మండలంలోని సిద్దాపూర్‌లో పేద యువతి పెళ్లికి కుటుంబసభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన నారయ్య, విజయమ్మలు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారికి ఒక కుమార్తె అనూష, కుమారుడు ఉన్నారు. కుమార్తె నిశ్చితార్థం కాగా గురువారం వివాహం జరగనుంది. పెళ్లి ఖర్చులకు డబ్బులు లేక సతమతమవుతున్నారు. గ్రామ యువకులు గుర్తించి యువతి పెళ్లికి సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఒకరికొకరు డబ్బులు పోగు చేసుకొని మొత్తం రూ.35 వేలు జమ చేసి నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు యువతకు కృతజ్ఞతలు తెలిపారు. బిక్కుమాండ్ల మనోహర్, భారతయ్య, నారాయణ, రాఘవులు, యువకులు మహేష్, రాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మాసోత్సవాలు

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు డీఎం ఉమాశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ హృషికేష్ హాజరయ్యారు. విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అదేవిధంగా డ్రైవర్ కే.రామకృష్ణను సత్కరించారు. ఎంఎఫ్ యాదయ్య, డీటీఐ గోవర్ధన్, సూపరింటెంట్ నజీర్‌తో పాటు ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ భారత్‌బందును విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండలంలోని కుమ్మెర గ్రామంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీకుమ్మెర గ్రామస్థులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సమ్మెలకు సంబంధించిన కరపత్రాలను కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిపేట భాస్కర్ విడుదల చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సభ్యుడు రామకృష్ణ, పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తుమ్మ మహేష్, పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు ఏసయ్య కోరారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీనివాసులు, కుర్మయ్య, విజయుడు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి/కల్వకుర్తిరూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, కార్మికులతో కలిసి సమ్మె పోస్టరును విడుదల చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, కార్మికులు పాల్గొన్నారు. మండలంలోని మార్చాల సమీపంలో ఉన్న కాటన్ మిల్లు ఎదుట కార్మికులతో కలిసి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడారు. సమ్మెలో పాల్గొనాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com